మెరుగైన వసతులు కల్పిస్తున్నాం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గత కొంత కాలంగా గోతులమయంగా మారిన రోడ్ల కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారన్నారు. సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే నిధులను మంజూరు చేయించామన్నారు. రోడ్డు పనులు పూరె్తైతే స్థానికులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నర్సింహకు సేవారత్న అవార్డు



మణికొండ: బాపిస్ట్ చర్చి అధ్యక్షునిగా ఉంటూ ఖానాపూర్ గ్రామంలో బాపిస్ట్ చర్చి నిర్మాణానికి కృషి చేసిన ఆర్. నర్సింహకు రాష్ట్ర స్థాయి సేవారత్న అవార్డు దక్కింది. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అటు గ్రామంతో పాటు క్రిస్టియన్ సమాజానికి చేస్తున్న కృషికి అభిలాష హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్ వారి 4వ వార్షికోత్సవం సందర్భంగా పలు రంగాలో సేవా కార్యక్రమాలను నిర్వహించినందకు ఆదివారం రవీంద్రభారతీలో అవార్డును అందజేసారు. ఈ సందర్భంగా నర్సింహా విలేకరులతో మాట్లాడుతూ రాజకీయం, సేవా రంగాలలో తను చేస్తున్న కృషిని గుర్తించి అవార్డును అందజేయటం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో తన సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తానన్నారు.

పెద్దమ్మ తల్లి దేవాలయ వేడుకలు



దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సాగర్ హిల్స్‌లోని శ్రీశ్రీశ్రీ వరసిద్ధి పెద్దమ్మ తల్లి దేవాలయం 6వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహ ఏర్పాటుకు హెచ్‌సీయూ బీఎస్‌ఎఫ్ మద్దతు

రాయదుర్గం: తెల్లాపూర్‌లోని కూడలిలో ప్రజా యుద్ధనౌక గద్దర్ విగ్రహ ప్రతిష్ట ఏర్పాటుకు హెచ్‌సీయూలోని బహుజన్ స్టూడెంట్స్ ఫ్రంట్ (బీఎస్‌ఎఫ్) సంపూర్ణ మద్దతు ఇస్తుందని యూనియన్ ప్రతినిధుల బృందం ప్రకటించారు. తెల్లాపూర్ కూడలిలో తెల్లాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ కొల్లారి భరత్ చేపట్టిన ఆమరణ దీక్షకు కూడా మా మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారని, ఇలాంటి విగ్రహాలను పెట్టి వారిని గౌరవించుకోవడం అవసరమని, ఈ విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. గద్దర్ స్మృతివనం ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. తెల్లాపూర్‌లో చేసే ఉద్యమానికి నిరంతరం బీఎస్‌ఎఫ్ పూర్తి మద్దతును ఇస్తుందని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ బీఎస్‌ఎఫ్ నాయకులు పరుశురామ్, ప్రసన్న, విమల, అంజి, అనీల్, శంకర్, జగదీష్, శ్రావణి, చందు పాల్గొన్నారు.

హాకీ క్రీడ పటిష్టతకు కృషి చేస్తా..

తెలంగాణ హాకీ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్



హైదరాబాద్ హాకీ క్లబ్స్ కెప్టెన్లతో విజయ్‌కుమార్

హఫీజ్‌పేట్ : రాష్ట్రంలో హాకీ క్రీడ పటిష్టత కోసం కృషి చేస్తానని తెలంగాణ హాకీ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం చందానగర్‌లోని ఆయన నివాసంలో హైదరాబాద్ నగరానికి చెందిన పలు హాకీక్లబ్‌ల కెప్టెన్లతో కలిసి హాకీక్రీడ పటిష్టతతో పాటు పలు సదుపాయాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ హాకీని దేశంలోనే ప్రథమ స్థానంలో తీసుకురావడం కోసం హాకీ క్రీడాకారులను తయారు చేస్తామన్నారు. జాతీయ హాకీ జట్టులో తెలంగాణ హాకీ క్రీడాకారుల ప్రాతినిధ్యం తదితర అవకాశాలపై చర్చించామన్నారు. చిన్నారులను హాకీ వైపు మళ్లించేలా ప్రతి పాఠశాలలో వ్యాయమా ఉపాధ్యాయులతో కలిసి ముందుకు సాగుతామన్నారు. జాతీయ హాకీ షెడ్యూల్ ప్రకారం టోర్నమెంట్ నిర్వహణకు రాష్ట్ర ప్రతినిధులతో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు. గురునానక్ హాకీ క్లబ్ అధ్యక్షులు గురుబచన్ సింగ్, రంజిత్ సింగ్, జలవీర్ సింగ్, కోచ్ తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రోడ్డు భద్రతపై గచ్చిబౌలి స్టేడియం వద్ద అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: ట్రాఫిక్ నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని రంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి ప్రవీణ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియం వద్ద డ్రైవింగ్ స్కూల్స్ కార్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిబంధనలు పాటించకపోవడంతోనే విలువైన ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించని వాహనదారులు ప్రమాదాల్లో తమ ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. నిబంధనలు పాటిస్తేనే సురక్షితమైన ప్రయాణం చేయవచ్చన్నారు. అనంతరం కొండాపూర్ ఆర్టీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐలు విజయరావు, వాసు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ.. సమస్యలతో వర్రీ!

- రూ.1కోటితో కట్టినా కనిపించని ప్రయోజనం
- కొత్త గ్రంథాలయానికి ఆకతాయిల బెడద
- నిలిచిపోయిన కంప్యూటర్ల ఏర్పాటు



శంషాబాద్‌లోని కొత్త గ్రంథాలయ భవనం



ధ్వంసం చేసిన అద్దాలు

శంషాబాద్: సుమారు పదేళ్ల పాటు అవస్థలమయంగా సాగిన పట్టణంలోని గ్రంథాలయానికి రూ.1కోటి 20 లక్షల నిధులతో నూతన గ్రంథాలయ భవనాన్ని నిర్మించి, ఎన్నికల ముందు ప్రారంభించారు. అన్ని హంగులతో భవనం నిర్మాణం చేసి పాఠకులకు అందుబాటులోకి తెచ్చినా ప్రయోజనం మాత్రం కనిపించడం లేదు.

ఎందుకంటే..

అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసిన కొత్త గ్రంథాలయానికి పూర్తి స్థాయి సిబ్బంది లేరు. ఇక్కడ పని చేసే గ్రంథపాలకుడు ఇక్కడ కొన్నిరోజులు బడంగ్‌పేట్‌లోని జిల్లా గ్రంథాలయంలో కొన్ని రోజులు విధులు నిర్వహిస్తున్నాడు. ఇక్కడ ఓ సహాయ గ్రంథపాలకుడు మాత్రమే ప్రతిరోజు గ్రంథాలయాన్ని తెరిచి విధులు నిర్వహిస్తున్నాడు. అంతేకాకుండా గ్రంథాలయాన్ని శుభ్రం చేసే సిబ్బందితో పాటు రక్షణ కోసం వాచ్‌మెన్ ఏర్పాటు చేయాల్సిన ఉన్నప్పటికి ఇంతవరకు ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో ఆధునిక హంగులతో నిర్మాణం చేసి అందుబాటులోకి తీసుకొచ్చిన గ్రంథాలయం పరిస్థితి అగమ్యగోచరంగా మారతోంది.

అందుబాటులో లేని కంప్యూటర్లు...

గ్రంథాలయంలో పాఠకుల సౌకర్యం డిజిటల్ లైబ్రెరీ కోసం నిధులు కూడా విడుదలయ్యాయి. కంప్యూటర్లను ఏర్పాటు చేసి దానిని అందుబాటులోకి తేవాలని భావించారు. అయితే గత కొన్ని రోజులుగా ఆకతాయిలు గ్రంథాలయం భవనానికి సంబంధించిన అద్దాలను పగలగొట్టడం వంటి చర్యలకు పాల్పడ్డారు. దీంతో కంప్యూటర్లు ఏర్పాటు చేసినా వాటికి భద్రత ఉండదనే భయంతో వాటిని ఇంతవరకు తీసుకురాలేదు. పూర్తి స్థాయి గ్రంథపాలకుడు కూడా లేకపోవడంతో పాఠకుల సంఖ్య కూడా తగ్గుముఖం పడుతోంది. సమీపంలో అనేక విద్యా సంస్థలు ఉన్నా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచే చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆధునికంగా తీర్చిదిద్దిన గ్రంథాలయం కాస్తా నిరుపయోగంగా మారుతోందనే స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం



పయనీర్ కాన్సెప్ట్ పాఠశాలలో విద్యార్థుల విన్యాసాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు ఉన్నత స్థాయిలో ప్రదర్శనలు ఇవ్వడం పట్ల పాఠశాల యాజమాన్యానికి గర్వించదగ్గ విషయమని లెఫ్టినెంట్ కర్నల్ మంజూల్ శర్మ,3టి(బీ)ఎన్‌సీసీ అన్నారు.కాటేదాన్ ప్రాంతంలోని పయనీర్ కాన్సెప్ట్ స్కూల్ 18వ వార్షికోత్సవానికి శనివారం సాయంత్రం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.విద్యార్థుల చేసిన విన్యాస ప్రదర్శనలు అందరిని మంత్రముగ్దుల్ని చేశాయి. అనంతరం వారు మాట్లాడుతూ..విద్యార్థులు పాఠశాల నుంచే భవిష్యత్తుకు పునాదులు పడుతాయని అన్నారు.ఈ పాఠశాల నుంచి ఢీల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలలో పాల్గొనేందుకు ఎన్‌సీసీ క్యాడెట్‌గా నిహిత చంద్రిక ఎంపిక కావడం గొప్ప విషయం అని అన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ప్రతి విద్యార్థి ప్రయత్నించాలని కోరారు. అనంతరం నిహిత చంద్రిక తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తృష్టి పాటిల్ ,పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్, తుల్జారాం ఫీడర్ పరిధిలోని అలకాపూర్ రోడ్డు నెంబర్ 22 నుంచి 30 వరకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, అలకాపూర్ ఫీడర్ పరిధిలో రోడ్డు నెంబర్ 14 నుంచి 22 వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఉప్పర్‌పల్లి, జలాల్ బాబానగర్, బాసిత్ బాబానగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ముగిసిన త్యాగరాజ ఆరాధన సంకీర్తనోత్సవాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ త్యాగరాజ ఆరాధన మ్యూజిక్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. జంటనగరాల్లోని కర్ణాటక సంగీత కళాకారులు గళార్చనతో కార్యక్రమాన్ని నిర్వహించారు. 500 మందికి పైగా సంగీత విద్వాంసులు కలిసి త్యాగరాజ స్వామి రచించిన ఘనరాగ పంచరత్న కృతులను, గాత్రం, వేణువు, వీణ, వయోలిన్, మృదంగం, ఘటం, మోర్సింగ్ వంటి వాయిద్యాల సహకారంతో కీర్తిస్తూ.. సందర్శకులను రంజింపజేశారు. సంస్కృతి ఫౌండేషన్ సభ్యులు ప్రముఖ సంగీత విద్వాంసులు కళారత్న విద్వాన్ మోదుమూడి సుధాకర్‌కి గురు సత్కారం చేసి, పలువురు కళాకారులను సత్కరించారు. సందర్శకులు, విద్వాంసులు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



జ్వాలా బట్టల షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్రంలో పండించిన పత్తి పంటకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గిరాకీ ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్ అన్నారు. ఆదివారం హైదర్‌గూడ అత్తాపూర్ 143 పిల్లర్ నంబర్ ప్రాంతంలో నిమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జ్వాలా బట్టల షోరూమ్‌ను ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం వ్యవసాయ దిగుబడులు ఘనంగా పెరిగాయని... అందులో ముఖ్యంగా పత్తి, మిర్చి, వరి పంటలను పండించడం జరిగిందన్నారు. అధిక దిగుబడులతో పాటు క్రిమిసంహారక మందులు లేకుండా మిర్చి, పత్తి పంటలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. యువకులు ఎవరికి వారు స్వయం ఉపాధిలో పది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నిలబడాలని ఆకాంక్షించారు. వస్త్ర పరిశ్రమకు సంబంధిత దుకాణాలను మరింతగా ప్రోత్సాహించేందుకు యువ పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ నాయకులు మిద్దెల బ్రదర్స్ సురేశ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, ఓనం శ్రీరామ్ రెడ్డి, నిమ్మల శ్రీనివాస్, పురుషోత్తం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు మెగా హెల్త్ క్యాంప్

గోల్కొండ: నేడు, రేపు ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని సహాయత ట్రస్ట్ ప్రతినిధి హాఫీజ్ ఇర్ఫాన్ నజీబ్ తెలిపారు. ఇండో యూఎస్ ఆసుపత్రి వారి సహకారంతో 13వ ఇండియా హెల్త్ ఇనిషియేటీవ్‌లో భాగంగా గోల్కొండ నయాఖిలాలోని ఉర్దూ హైస్కూల్‌లో ఈ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు రెండు రోజుల పాటు జరిగే ఈ వైద్య శిబిరంలో తమ సేవలు అందిస్తారని, వైద్య పరీక్షలతో పాటు రోగ నిర్ధారణ పరీక్షలు, అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందిస్తామని ఆయన తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని ఆయన తెలిపారు.

ఇంగ్లిష్ స్కిల్స్ ట్రైనింగ్ తరగతులను సద్వినియోగం చేసుకోండి

మియాపూర్: స్వామి వివేకానంద జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరామకృష్ణ వివేకానంద సేవా సమితి మియాపూర్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ స్కిల్స్ ట్రైనింగ్ (ఆంగ్లభాష కౌశల శిక్షణ) తరగతులను నిర్వహిస్తున్నట్లు సేవా సమితి సభ్యులు డాక్టర్ కనగలూరు చంద్రశేఖరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మియాపూర్‌లోని ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీ రాధా మాధవ్ అపార్టుమెంట్ జంక్షన్ సమీపంలో ప్లాట్ నంబర్ 166 సేవా సమితి కార్యాలయంలో ప్రతి ఆదివారం ఆంగ్ల భాష శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మల్లన్నను దర్శించుకున్న మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్



పుప్పాలగూడలో మల్లన్న బోనాలు

ఘనంగా మల్లన్న కల్యాణం



స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: పుప్పాలగూడలో మల్లన్న కల్యాణోత్సవం, బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఉదయం గంపలతో సామూహికంగా దేవాలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం స్వామి వారి కల్యాణంను ఒగ్గు కళాకారుల సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు దేవాలయం ఆవరణలోనే బోనాలను చేసి స్వామి వారికి సమర్పించారు. కల్యాణోత్సవంలో చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్, బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొని పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌లు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

మల్లన్నస్వామి ఆలయ ఉత్సవాలు



ఉత్సవాల్లో కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్ సతీష్

శంషాబాద్ రూరల్: మండలంలోని హమీదుల్లానగర్‌లో ఆదివారం శ్రీమల్లికార్జున స్వామి ఆలయం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాల ఊరేగింపుతో వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్పొరేటర్ టి.శ్రీనివాస్‌రెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఉత్సవ నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సతీష్‌యాదవ్, సొసైటీ చైర్మన్ దౌనాకర్‌గౌడ్, ఉపసర్పంచు జగన్‌మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు మల్లారెడ్డి, నాయకులు బి.ధన్‌పాల్‌రెడ్డి, బి.లక్ష్మారెడ్డి, నవారు కల్యాణ్‌రెడ్డి, శేఖర్ యాదవ్, రాజుయాదవ్, ప్రకాష్, రమేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం



వాచ్‌మెన్‌ను కరవటంతో రక్తసిక్తమయిన కాలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధి కాలనీలలో ప్రతి రోజు వీధి కుక్కలు ప్రజల వెంటపడి కరుస్తున్నాయి. దాంతో ప్రజలు రోడ్లపైకి వెళ్లాలంటేనే జంకుతున్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో పేపర్ బాయ్‌ను ఓ వీధి కుక్క కరిచింది. దాంతో బాలుడికి గాయాలయ్యాయి. దీనిని మరవకముందే ఆదివారం ప్లైజెంట్ వ్యాలీ కాలనీలో ఓ వాచ్‌మెన్‌కు కరిచింది. దాంతో అతని కాలు రక్తసిక్తం అయ్యింది. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో ఆదివారం ఓ వైపు కుక్కలకు వ్యాక్సిన్‌లు వేస్తున్న సమయంలోనే ఈ సంఘటన జరగటంతో చర్చానీయాంశమయ్యింది. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు వీధి కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని పలు కాలనీల ప్రజలు కోరుకుంటున్నారు.

రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు



జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయిన నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా 3వ సారి ఎన్నికైన బొక్క నర్సింహారెడ్డికి మణికొండ మున్సిపల్ నాయకులు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో వారు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్ మాట్లాడుతూ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జిల్లాలో బలమైన శక్తిగా ఎదిగిందని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు కొమరయ్య, మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, కౌన్సిలర్‌లు ఎల్.వందన నగేష్, బి.శ్వేత రవికాంత్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు జె.సిద్దప్ప, జె.లక్ష్మీరాములు, నాయకులు సీహెచ్ ఇందిర, ఎం.రాఘవరెడ్డి, అనితాదేవి, కె.నర్సయ్యాచారి, రవి కాంత్‌రెడ్డి, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ ఆత్మహత్య



అతిథి అగర్వాల్ (ఫైల్)

అత్తాపూర్: అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ చింతల్‌మేట్ ప్రాంతానికి చెందిన అతిథి అగర్వాల్ (34) మణికొండ ప్రాంతానికి చెందిన రాహుల్ సెనాయ్‌తో 2015లో వివాహం జరిగింది. కొన్నేళ్ల పాటు సజావుగా సాగిన వీరి కాపురంలో విభేదాల కారణంగా 2019లో విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటుంది. అనంతరం అతిథి అగర్వాల్ తోటి ఐటీ ఉద్యోగి మహ్మద్ అహ్మద్ అలీ (31)తో జీవనం కొనసాగిస్తుంది. దీంతో వీరిద్దరూ వచ్చే నెల ఫిబ్రవరి 12వ తేదీన వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కాగా గత నెల 14వ తేదీన అతిథి అగర్వాల్‌కు అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి వెళ్లగా... గర్భవతి అని తెలిసింది. అనంతరం అదితి అగర్వాల్ రెండు నెలల అనంతరం మరోసారి ఆసుపత్రికి పరీక్షల నిమిత్తం వెళ్లగా... శిశువు గుండె కొట్టుకోవడం అసాధారణంగా ఉందని వైద్యులు తెలిపారు. దీంతో తీవ్ర మనస్థాపంలో ఉన్న అతిథి అగర్వాల్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మహ్మద్ అహ్మద్ అలీ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు అతిథి అగర్వాల్ మృతదేహన్ని చూడగా... ఎడమ చేతికి గాయం, రక్తస్రావం గమనించారు. దీనిపై కుటుంబ సభ్యులు అతిథి అగర్వాల్ మృతిపై అనుమానాలు ఉన్నట్లు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



తప్పిపోయిన మహిళ కృష్ణప్రియ

మణికొండ: ఇంట్లో ఉండాల్సిన మహిళ లేకపోవటం, చుట్టు పక్కల ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవటంతో భర్త నార్సింగి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పుప్పాలగూడలోని బిగోనియా గేటెడ్ కమ్యూనిటీ సమీపంలో డి.బాలకృష్ణ తన భార్య కృష్ణప్రియతో కలిసి ఉంటున్నాడు. వారికి రెండు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. డ్రైవర్‌గా పనిచేస్తున్న బాలకృష్ణ శనివారం ఉదయం 8.30 గంటలకు విధులకు వెళ్లాడు. మధ్యాహ్నం తన భార్యకు ఫోన్ చేస్తే తీయకపోవటంతో సమీపంలో ఉండే తన చెల్లెలు దుర్గాభవానికి ఫోన్ చేసి వెళ్లి చూడమని చెప్పాడు. సోదరి వెళ్లి చూసి కృష్ణప్రియ ఇంట్లో లేదని, ఇంటికి తాళం వేసి ఉందని చెప్పింది. దాంతో అతను ఇంటికి వచ్చి చుట్టు పక్కల, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకపోవటంతో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు ఆదివారం తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మణికొండ: ఫిట్స్ వచ్చి వ్యక్తి మృతి చెందిన సంఘటన కాళీమందిర్ దేవాలయం వద్ద జరిగింది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం సాయంత్రం ఓ వ్యక్తి కాళీ మందిర్ దేవాలయం వద్ద ఫిట్స్ వచ్చి పడిపోయాడు. చుట్టు పక్కల వారు సపర్యలు చేస్తుండగానే అతను మృతి చెందాడు. అతను కొద్ది రోజులుగా దేవాలయం చుట్టు పక్కలనే ఉంటూ భిక్షాటన చేస్తున్నాడని, హిందీ భాష మాట్లాడేవాడని, దేవాలయం వద్ద ఉన్న వ్యాపారులు పేర్కొన్నారు. మాజీ సైనికుడ్యోగి రాంచందర్ అజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు ఆదివారం తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230